క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

బోరు నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న దేముడుబాబు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి వేణు గోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో మంచి నీటి బోరు, మోటారు ఏర్పాటుకు కో ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు ఆర్.ఎస్.దేముడుబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. కుచ్చెర్లపాటి శంకరబాబు, శివకుమార్, రామరాజులు తమ తండ్రి లక్ష్మీపతి జ్ఞాపకార్థం రూ.80 వేలతో ఈ బోరు, మోటారు ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబరు మహంతి అప్పలరమణ, అలుగోలు బ్రహ్మం, పి.రామకృష్ణ పాల్గొన్నారు.


నేడు అనంతవరంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కంటుబోతు రాంబాబు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు.

శక్తి కేంద్రాలతో బీజేపీ బలోపేతం

ఆనందపురం : అధిష్టానం పిలుపు మేరకు గ్రామాల్లో శక్తి కేంద్రాలు ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మీసాల రామునాయుడు పిలుపునిచ్చారు. వెల్లంకిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శక్తి కేంద్రాలతోపాటు, మిగిలి ఉన్న బూత్ కమిటీలను వెంటనే నియమించాలని కోరారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి అన్ని ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పీవీవీ ప్రసాదరావు పట్నాయక్, మండల ఉపాధ్యక్షుడు బోర శ్రీను, నాయకులు సాయి రమేష్, పిల్లా చిన్నారావు, ఇంటి సత్తిరాజు, నిమ్మకాయల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

తాపీమేస్త్రి అదృశ్యం


వెంకటరావు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు రాయప్పాలెం పల్లివీధికి చెందిన మల్లేటి వెంకటరావు అనే తాపీ మేస్త్రి ఈ నెల 18న ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. ఈ మేరకు ఆదివారం అతని భార్య లక్ష్మి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంకటరావు ఇటీవల ఎక్కువగా భవన నిర్మాణానికి సంబంధించి పనులు కాంట్రాక్ట్‌కు తీసుకోవడంతో నష్టపోయాడు. ఈ విషయంలో భార్యతో తగాదాలు జరిగేవి. ఈ క్రమంలో అదృశ్యం కావడంతో భీమిలి ఏఎస్ఐ సింహాచలం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేధిస్తున్న వసతి సమస్య

- ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు ఇబ్బందులు
- వసతి కల్పించి, అధ్యాపకులను నియమించాలని డిమాండ్


తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్న వసతిగృహం

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ఆవరణలో రెండేళ్ల క్రితం ప్రారంభించిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను వసతుల సమస్య వేధిస్తోంది. ప్రారంభంలో జెడ్పీ బాలికల, బాలుర హైస్కూల్ గదుల్లో తరగతులు నిర్వహించినప్పటికీ వారికీ వసతి సమస్య ఎదురవడంతో పక్కనే నిర్మించిన బాలికల వసతి గృహంలో తాత్కాలికంగా మహిళా డిగ్రీ కళాశాల తరగతులు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి 2019 ఆగస్టులో కళాశాల ప్రారంభించినప్పటికీ వసతి సమస్య కారణంగా విద్యార్థినుల ప్రవేశాలు జరగలేదు. 2021 - 2022 విద్యా సంవత్సరం మధ్యలో 30 సీట్లు వంతున ఏడు కోర్సులు ప్రవేశపెట్టారు. వాటిలో బీఏ (ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, ఆఫీస్ మేనేజ్‌మెంట్), బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్), బీకాం కంప్యూటర్స్, బీకాం జనరల్, బీఎస్సీ (బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ), బీఎస్సీ(మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ), బీఎస్సీ(మాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్) ఉండగా 103 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని 31 మంది రిపోర్ట్ చేశారు. చివరకు బీకాం కంప్యూటర్స్ - 8, బీఎస్సీ - 21 మంది మాత్రమే మిగిలారు. వీరికి భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి కామర్స్, ఇంగ్లిష్, నగరంలోని వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి కంప్యూటర్ సైన్స్, తెలుగు, కెమిస్ట్రీ, ఫిజిక్స్, నర్సీపట్నంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి జువాలజీ, బోటనీ, మ్యాథ్స్ సబ్జెక్టులకు సంబంధించి 11 మంది అధ్యాపకులు వారానికి రెండు రోజుల వంతున తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ విద్యార్థులే రెండో సంవత్సరం పూర్తి చేసుకుంటుండగా 2022 - 2023 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు జరగలేదు. ప్రస్తుతం డిగ్రీ తరగతులు నిర్వహిస్తున్న వసతి గృహానికి విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, వాష్‌రూమ్‌లు లేవు.

ఇన్‌చార్జి బాధ్యతలు కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్‌కు..

ప్రారంభంలో చిట్టివలస డిగ్రీ కళాశాల బాధ్యతలను భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మంజులకు అప్పగించారు. తర్వాత నగరంలోని వి.ఎస్.కృష్ణా కళాశాల ప్రినిపాల్‌కు అప్పగించారు. ఇటీవల బదిలీపై వచ్చిన అక్కడి ప్రిన్సిపాల్ విజయబాబు ప్రస్తుతం ఈ డిగ్రీకళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్. చిట్టివలస డిగ్రీ కళాశాలలో కార్యాలయ నిర్వహణ కోసం ఇద్దరు రికార్డు అసిస్టెంట్లు, ఒక జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వర్తిస్తుండగా వీరిలో ఇద్దరికి సాంకేతిక కారణాలతో గత ఏడు మాసాలుగా జీతభత్యాలు జమ కావడం లేదు.

30 ఏళ్లుగా కళాశాల కోసం ఎదురుచూపులు...

1993 నుంచి తగరపువలస ప్రాంతంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఉండాలనే డిమాండ్ ఉండేది. స్థానికంగా ఇంటర్మీడియట్ పూర్తి చేసుకునే బాలికలు డిగ్రీ విద్యకు విశాఖ, విజయనగరం పట్టణాలకు రాకపోకలు సాగించేవారు.

తగరపువలస చుట్టుపక్కల ప్రైవేట్ కళాశాలలు ఉన్నప్పటికీ ఫీజుల భారం, భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దగ్గర మార్గాలు లేకపోవడంతో చాలా మంది ఇంటర్మీడియట్‌తోనే చదువుకు స్వస్తి పలికేవారు. ఇప్పుడు చిట్టివలసలోనే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసినందున పూర్తిస్థాయిలో వసతులు ఏర్పాటు చేయాలని, అధ్యాపకులను నియమించాలని ఇక్కడి విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

గొయ్యి పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..


కొండపేటలో గొయ్యి పూడ్చివేత పనులు పరిశీలిస్తున్న నాయకులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు గోస్తనీనది తీరంలో కొండపేట పంప్‌హౌస్ వద్ద పైప్‌లైన్ పగిలిపోగా ఏర్పడిన గొయ్యిని ఒకటో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం దగ్గర ఉండి పూడ్చి వేయించారు. 'నుయ్యిలా.. భారీ గొయ్యి' శీర్షికతో ఈ నెల 24న సాక్షిలో వార్త ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు పగిలిన పైప్‌లైన్‌కు మూడు రోజులుగా మరమ్మతులు చేయించారు. ఆదివారం నాటికి ఆ పనులు పూర్తి కావడంతో ట్రాక్టర్లతో డెబ్రిస్ తీసుకొచ్చి పూడ్చి చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం ఈ పైప్‌లైన్ వేశారన్నారు. ప్రస్తుతం యుద్ధ ప్రాతిపదికన కొండపేట నుంచి చిల్లపేట వరకు రూ.1.25 కోట్లతో కొత్త పైప్‌లైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జీవీఎంసీ అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారన్నారు. దీనికి సంబంధించి జూన్ 16న టెండర్లు పిలవనున్నామన్నారు. వాస్తవానికి గతంలో ఇక్కడ ఇళ్లు నిర్మించుకోవడానికి 60 గజాల స్థలం ఇస్తే అప్పట్లో వారు 120 గజాల్లో ఇళ్లు నిర్మించుకోవడమే కాకుండా పైప్‌లైన్ ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్నారు. అయినప్పటికీ ఇక్కడి ఇళ్లకు ఉత్తర, దక్షిణంగా రెండు వైపులా సీసీ రోడ్లు నిర్మించామన్నారు.

కొత్త బిచ్చగాళ్లలా జనసేన నాయకులు...

ఇటీవల ఈ ప్రాంతంలో జనసేన నాయకులుగా చెప్పుకుని తిరిగేవారు కొత్త బిచ్చగాళ్లలా వ్యవహరిస్తున్నారన్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దేవా చేశారు. సమస్యను పరిష్కరిస్తున్న సమయంలో దూరి నానా యాగీ చేసి అభాసుపాలవుతున్నారన్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమస్యలపై వెంటనే స్పందించి ప్రజలకు అండగా ఉంటుండగా... పిల్ల సైనికులు పసుపు రాసుకుని మధ్యలో దూరుతున్నారన్నారు. పూడ్చిన గొయ్యిని వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు ఉప్పాడ నాగేశ్వరరావు, జీవీ రమణ, నాయకులు చింతగుంట శివ, సిమ్మల ప్రసన్న, పందిరి విజయ్, దుంప సాయిరెడ్డి తదితరులు పరిశీలించారు.

గుడ్లవానిపాలెంలో దొంగల హల్‌చల్


చిందరవందరగా పడేసిన దుస్తులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గుడ్లవానిపాలెంలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి గెస్ట్‌హౌస్‌లో, ఇడదాసి సత్యం ఇంటిలో చోరీకి పాల్పడ్డారు. సత్యం కుటుంబ సభ్యులతో శుభకార్యం కోసం విజయనగరం వెళ్లగా ఇంటిలోకి దొంగలు చొరబడి లక్ష రూపాయల నగదు, 5 తులాల బంగారం ఎత్తుకుపోయారు. అదేవిధంగా పోలిరెడ్డి గెస్ట్ హౌస్‌లో బీరువా విరగ్గొట్టి దుస్తులు చిందరవందరగా పడేశారు. విషయం తెలుసుకున్న ఆరిలోవ సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలిస్తున్నామని తెలిపారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ


కార్మికవాడలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

తగరపువలస: చిట్టివలస శ్రీ ఉమామహేశ్వర దేవాంగుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్మికవాడలో చలివేంద్రం ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అలంక సాంబమూర్తి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ వేసవిలో చలివేంద్రాల ద్వారా చల్లటి నీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మావూరి తవుడు, మావూరి శ్రీనివాసరావు, కొండపల్లి వెంకటరావు, నక్కిన లక్ష్మణరావు, ముతికరాజు, వేమన కామేష్ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం ఆవరణలో ఆదివారం విస్తృతంగా మజ్జిగ పంపిణీ చేశారు. పీఎంపాలెంకి చెందిన మాదాబత్తుల నర్సింగరావు, లక్ష్మి దంపతుల సహాయ సహకారాలతో పాదచారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు కేవీ నాగేశ్వరరావు, ఆలయ ధర్మకర్త పిల్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పిల్లా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత చేపలుప్పాడ


ట్రోఫీతో విజేత జట్టు సభ్యులు, నాయకులు

ఆనందపురం : మండలంలోని వెల్లంకి పంచాయతీ గారిపేటలో ముత్యాలమ్మ, మరిడమ్మ పండగ సందర్భంగా శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న చేపలుప్పాడ జట్టు విజేతగా నిలిచింది. 15 రోజులుగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో చేపలుప్పాడ జట్టు విజేతగా నిలవగా రూ.15వేలు, విన్నర్స్‌గా నిలిచిన బోయిపాలెం జట్టుకు రూ.10వేలు చొప్పున నగదు బహుమతిని, ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొట్టా ధనలక్ష్మి, బొట్టా రామకృష్ణ, వెల్లంకి ఉప సర్పంచ్ కంచరాపు శ్రీనివాసరావు, తాళ్లవలస, వెల్లంకి ఎంపీటీసీ సభ్యులు కోరాడ రమణ, పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


ఆకట్టుకున్న నృత్యం, కోలాటం ప్రదర్శన


బాలికల కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం మధురవాడ శిల్పారామం జాతరలో ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. లిటిల్ స్టెప్స్ స్కూల్ బాలికల కూచిపూడి నృత్యం, శ్రీ ముత్యాలమ్మ బృందం కోలాటం, లక్ష్మి కర్నాటక సంగీత ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకున్నాయి. శిక్షకురాలు శైలజ సారథ్యంలో బాలికలు ప్రదర్శనలు ఇచ్చారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బరాజు, వరల్డ్ ఆస్ట్రాలజిస్ట్ శ్రీరామశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జీకే కాలనీలో నివాసాల మధ్య దుర్వాసన


బ్లాకుల మధ్య కాలువ నిండిపోయి బయటకు వచ్చిన వ్యర్థాలు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస జేఎన్ఎన్‌యూఆర్ఎమ్, రాజీవ్ గృహకల్ప పాత కాలనీలో బ్లాకుల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, చెత్త పేరుకుపోవడంతో స్థానికులు దుర్వాసన భరించలేకపోతున్నారు. ఇక్కడ 91, 92 బ్లాకుల మధ్య పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. కొందరు చెత్త, వ్యర్థాలు డస్ట్‌బిన్‌లలో వేయకుండా వెనక్కి పడేస్తున్నారు. బ్లాకుల మధ్య ఖాళీ స్థలాలు, అక్కడి భారీ కాలువలు సైతం నిండిపోయి మురుగునీరు, వ్యర్థాలు బయటకి వచ్చేస్తున్నాయి. పైగా మ్యాన్ హోల్స్ నిండిపోవడంతో వచ్చిన సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు సమస్యను మరింత జఠిలం చేస్తున్నాయి. పందుల సంచారంతో పరిశుభ్రత మరింత లోపిస్తోంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. జీవీఎంసీ సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో పరిస్థితి మరింత అధ్వానంగా తయారయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త, వ్యర్థాలు తొలగించి, పరిసరాలు శుభ్రం చేయించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు 'రైతు భరోసా' పంపిణీ

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో ఈ నెల 30న జిల్లా స్థాయి రైతు భరోసా ఐదో విడత మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.వి.ఎస్.చలం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కర్నూలులో ఈ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించగా పద్మనాభం మండలం పాండ్రంగిలో జిల్లా స్థాయిలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. పద్మనాభం మండలంలో 8,459 మంది రైతులకు రైతు భరోసా రూ.11.42 కోట్లు మంజూరైనట్టు పేర్కొన్నారు.

సాగర తీరంలో కూల్‌గా..


రుషికొండ బీచ్‌లో పర్యాటకులు

కొమ్మాది: ఉదయం నుంచి ఉక్కపోత, గాలి లేక ఎర్రటి ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు సాయంకాలం సాగరతీరాన్ని ఆశ్రయించారు. మంగళవారం భానుడు భగభగమంటూ నిప్పులు కక్కడంతో గంటల తరబడి సముద్ర తీరంలో స్నానాలు చేసేందుకు ఆసక్తి కనబరిచారు. భీమిలి బీచ్, సాగర్‌నగర్, రుషికొండ బీచ్‌లో ఒక్కసారిగా పర్యాటకుల తాకిడి పెరిగింది.

చల్లని నేస్తాలు

భానుడి ప్రతాపం నుంచి ఉపశమనమిస్తున్న భారీ వృక్షాలు


పావురాల పార్కులోని రావి వృక్షంతోపాటు ఇతర చెట్లు


నూకాలమ్మ ఆలయం వద్ద నీడనిస్తున్న భారీ మర్రి వృక్షం

భీమునిపట్నం: కొద్ది రోజులుగా ఎండలు మండిపోతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యమైన పనులు ఉంటే తప్ప ఇంటి నుంచి వెలుపలకు రావడం లేదు. ఇక పనిపై బయటకు వచ్చిన వారు ఆపసోపాలు పడుతున్నారు. అయితే ఇంత ఎండల్లోను భీమిలిలోని రెండు చోట్ల చల్లని నేస్తాలు స్థానికులను భానుడి ప్రతాపం నుంచి రక్షిస్తున్నాయి. భీమిలి మెయిన్‌రోడ్డులోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో గ్రామదేవత నూకాలమ్మ ఆలయం ఉంది. దానిని ఆనుకుని విశాలంగా భారీ మర్రి వృక్షం ఉంది. దీని కొమ్మలు, ఆకులు దట్టంగా ఉండడంతో చుట్టుపక్కల పూర్తి నీడ విస్తరించి ఉంటుంది. బయట ఎంత వేడి ఉన్నా ఇక్కడ చల్లగా ఉంటుంది. దీంతో ఆలయానికి వచ్చే భక్తులతోపాటు, సామాన్యులు కూడా దీని కింద సేద తీరుతుంటారు. పక్కనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉండగా అక్కడకు వివిధ ప్రాంతాల నుంచి పనులపై వచ్చేవారు కూడా ఇబ్బందులు పడకుండా హాయిగా సేద తీరుతున్నారు. బీచ్‌వద్ద లైట్‌హౌస్ ఎదురుగా ఉన్న పావురాల పార్కులో ఉన్న పెద్ద రావి వృక్షంతోపాటు మరికొన్ని చెట్లు మంచి నీడను ఇస్తున్నాయి. అనేక ప్రాంతాల నుంచి తీరానికి వచ్చే సందర్శకులు పార్కులోని ఈ చెట్ల వద్దే సేదతీరుతూ భోజనాలు, అల్పాహారాలు చేసి వెళ్తుంటారు. ఇలా ఈ రెండు ప్రాంతాల్లో వృక్షాల వల్ల ఎండల నుంచి చాలా మంది సొమ్మసిల్లకుండా ఉపశమనం పొందుతున్నారు.

తూర్పు కాపు నూతన జేఏసీ ఏర్పాటు


సంఘీభావం తెలుపుతున్న తూర్పు కాపు జేఏసీ నాయకులు

సీతమ్మధార : తూర్పు కాపు కులాన్ని చిన్నచూపు చూస్తున్న రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పి తీరుతామని ఆలిండియా తూర్పు కాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ హెచ్చరించారు. ఆశీలమెట్టలో జరిగిన రాష్ట్ర తూర్పు కాపు జాయింట్ యాక్షన్ కమిటీ ఆవిర్భావ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా తూర్పు కాపు రిజర్వేషన్ల సాధనకు పలుమార్లు ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా నేటికీ పరిష్కారం కాకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో 36 మందితో తూర్పు కాపు జేఏసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర జేసీ చైర్మన్‌గా గిరగా అప్పలస్వామి, కో చైర్మన్‌గా అన్నెపు రామకృష్ణనాయుడు, గౌరవ చైర్మన్‌గా పైలా శ్రీనివాసరావు, వర్కింగ్ చైర్మన్లుగా బబ్బాది ఫకీర్‌నాయుడు, పతివాడ కృష్ణవేణి, చీఫ్ సెక్రటరీలుగా రాయి శ్రీనుబాబు, ఈ.శ్రీనివాసరావు, కె.అచ్చెంనాయుడు, ఎం.గురునాయుడు, కోశాధికారిగా బెల్లాన సంతోష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల అప్పల సూరినాయుడు, ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వని, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి

మధురవాడ: నటసార్వభౌముడు నందమూరి తారక రామారావు జయంతిని మధురవాడ పీహెచ్‌సీ వద్ద టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడి ఆయన విగ్రహం వద్ద 7వ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, వార్డు అధ్యక్షుడు పిల్లా నర్సింగరావు తదితరులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాగోతి సూర్యప్రకాశరావు, సోంపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సాయిబాబా విగ్రహం


చినగదిలి ఆలయంలో ఏర్పాటు చేసిన విగ్రహం

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో మరో సాయిబాబా విగ్రహాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఊపిరి పీల్చుతూ వదులుతున్నట్లు ఉన్న ఈ విగ్రహాన్ని రవిచంద్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో తయారు చేశారు. దీన్ని ఆదివారం ఇక్కడి ఆలయంలో భక్తుల దర్శనం కోసం ఉంచారు. ఊపిరి పీల్చుతూ వదలడం, ఎడమ చేతి మధ్య వేలు కదపడం, నవ్వుతున్నట్టు ఉన్న ఈ సాయిబాబా విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది. నాలుగు నెలల క్రితం కూడా రవిచంద్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మాట్లాడే సాయిబాబా విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేసి కొద్ది రోజులు అనంతరం దాన్ని చింతపల్లికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని నెల రోజుల పాటు ఇక్కడ సందర్శకుల దర్శనం కోసం ఉంచనున్నట్టు రవిచంద్ ఆర్ట్స్ నిర్వాహకుడు రవిచంద్ తెలిపారు. సుమారు ఐదున్నర అడుగుల ఎత్తు ఉండే ఈ విగ్రహాన్ని రూ.8 లక్షలు ఖర్చుతో మూడు నెలల పాటు శ్రమించి తయారు చేసినట్లు తెలిపారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు సర్వం సిద్ధం

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి సర్వం సిద్ధంగా ఉన్నట్లు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే కౌన్సెలింగులో భాగంగా విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి సిబ్బందిని నియమించినట్లు చెప్పారు.

తీసుకురావాల్సినవి ఇవీ...

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ప్రాసెసింగు ఫీజు రసీదుతో పాటు పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఎస్ఎస్‌సీ మార్కుల మెమో (ఒరిజినల్ లేదా ఇంటర్‌నెట్ కాపీ), 4-10 తరగతుల వరకు స్టడీ సర్టిఫికెట్ లేదా రెసిడెన్స్ సర్టిఫికెట్, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ (ఓసీ అభ్యర్థులకు), 01.01.2020 నాడు లేదా తర్వాత జారీ చేసిన ఆదాయ ధ్రువపత్రం, కులధృవీకరణ పత్రం, టీసీ, ప్రత్యేక కేటగిరీ విద్యార్థులు వారికి సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకు రావాల్సి ఉంటుంది.